4/3/90

113

# మనసుగతి ఇంతే!

—విజయలక్ష్మీ నారాయణ్

...లోకం హర్షించదని తెలిసికూడా... నా కన్యత్వాన్ని వదులుకోవాలనే నిర్ణయం చేసుకున్నాను...అందువల్ల ప్రాప్తించే మాతృత్వాన్ని కూడా ధైర్యంగా స్వీకరించదలచుకున్నాను....

రిక్షాను అతి ఉత్సాహంగా ఒక్క గెంతులో దిగి, అంతకుముందే చేతిలో సిద్ధంగా ఉంచుకున్న డబ్బుని రిక్షావాడి చేతిలో దాదాపు కుక్కుతున్నట్లుగా ఉంచి చేతిలోని ప్లాస్టిక్ బ్యాగ్‌ని అతి విలాసంగా పైకెగరేసి పట్టుకుంటూ, దాదాపు ఎగురుతున్నట్లుగా మేడ మెట్లు ఎక్కడం ప్రారంభించాను నేను.

ఒక్కసారి నేను తల ఎత్తి చూసినట్లయితే వీధి గేట్‌కేసి చుట్టుకున్న బౌగీ తీగెతో సహా అనేక జతల కళ్ళు అనూహ్య దృశ్యమేదో చూస్తున్నట్లుగా విభ్రాంతితోనే నావైపే చూడటం కనిపిస్తుందని నాకు తెలుసు.

పాపం అలా చూడటం వాళ్ళ తప్పుకాదు. రోజూ ఘోర అపరాధం చేసిన దానిలా తలను పూర్తిగా భూమిలోకి దించుకొని భయపడ్తున్నట్లుగా నడిచి వెళ్ళే నేను ఒక్కసారిగా అందుకు పూర్తి భిన్నంగా ఇలా కనిపిస్తే ఆశ్చర్యం కాక ఏమిటి మరి? అయినా ఎదుటివార్ని అపార్థం చేసుకొనే మూడ్‌లో లేనిప్పుడు. నోటికొచ్చిన పాటేదో కూనిరాగం తీస్తూ నా గది తాళం తెరిచి, లోపలికి వెళ్ళీవెళ్ళగానే ఎదురుగా ఉన్న సోఫాలో రిలాక్స్‌గా కూర్చున్నాను. చేతిలో బ్యాగ్ నా ప్రమేయం లేకుండానే గుండెల దగ్గర స్థానాన్ని సంపాదించుకుంది. బ్యాగ్ కొత్తది కావడంవల్ల గుచ్చుకుంటుంది. అయినా హాయిగా ఉంది.

రోజుట్లా ఇంట్లో అడుగిడుతూనే కాఫీ నీళ్ళ కోసం తపించిపోతూ స్టవ్ దగ్గరకు పరిగెత్తకుండా ఇలా కూర్చుని మధురూహలను ఆహ్వానించే నా తీరు నాకే ఆశ్చర్యంగా ఉంది.

అదేమిటి హఠాత్తుగా మీ కళ్లలో చిరాకు తాలుకూ ఛాయలు. ఓహో సారీ అండీ! విషయమేదో చెప్పకుండా నా ధోరణిలో నేను చెప్పుకుపోతున్నందుకు ఇందాక అపరాధం అన్న పదం చూసినప్పటి నుండీ. అది ఘోరమైందికాకున్నా చిన్నదైనా అయ్యుంటుంది. లేకుంటే నేనంత ఉదాసీనంగా ఉండను. అది ఎలాంటిదై ఉంటుందబ్బా అన్న జిజ్ఞాసతో గింజుకుంటున్న మిమ్మల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా నా ధోరణిలో నేనున్నందుకు మరోసారి సారీ. అయితే మీరు ఊహించిన తప్పేమీ చేయలేదులెండి. మరింకేం అయ్యుంటుందబ్బా అని మళ్ళీ ఊహల్లోకి వెళ్ళిపోకండి! ఇక నేను నన్ను నేను పరిచయం చేసుకోవడంలో ఏ మాత్రం ఆలసించను. నా పేరు మాళవిక. మీరు కాస్త సాహిత్యాభిమానులైతే ఈ పాటికి 'మాళవికాగ్నిమిత్రమ్' అనే నాటకం గుర్తుకు వచ్చి ఉంటుంది. మా నాన్న కాళిదాసు పంకాలెండి. ఐమీన్ అభిమాని. పాపం పిచ్చి తండ్రి ఏ అగ్ని మిత్రుడో నా సౌందర్యాన్ని చూసి మోహించి కట్నం లేకుండా చేసుకుంటాడని ఊహించి ఆ పేరు పెట్టి ఉంటాడు.

ఆ! సౌందర్యం అంటే గుర్తుకు వచ్చింది. ఆలంకారికులు సాధారణ నాయికల్ని ముగ్ధ, మధ్య, ప్రౌఢ అని మూడు విధాలుగా విభజిస్తారు. నా విషయంలో ముగ్ధగా ఉన్న ఆ రోజులు అతి మధురమైనవి. తొలి రేకు విప్పుతున్న నా యవ్వన సౌందర్యాన్ని చూసిన వాళ్ళంతా కళ్ళింత చేసుకొని ప్రశంసిస్తుంటే ఎంత గర్వపడిపోయేదాన్నో నేను. నన్ను నేను ప్రపంచ సుందరిగా భావించేదాన్ని. అది అజ్ఞానమే అయినా. అజ్ఞానపు హాయి అద్భుతంగా ఉంటుంది సుమా అని పిస్తుందిప్పటికీ.


ఆ తర్వాత మధ్య స్థానాన్ని పొందడానికి ఎంతో కాలం పట్టలేదు. సృష్టి రహస్యం గుప్పిట్లో దాగిన తాయిలంలా ఊరిస్తూ ఉంటుంది. నన్ను చూస్తున్న మగాళ్ళ కళ్ళలో కదలాడే భావాలకు అర్థం మెల్ల మెల్లగా అర్థమౌతుండేది. దాంతో కనురెప్పలు సిగ్గుతో అరమోడ్పులయ్యేవి. మోడ్చిన ఆ కళ్లలో ఎన్నెన్ని అందమైన కలలో...

ఇంతలో ముంచుకొచ్చింది ఈ ప్రౌఢిమ. సంపూర్ణంగా విచ్చుకున్న పుష్పంలాంటిది ఈ వయసు. నేను అందరికీ, అందరూ నాకు పూర్తిగా అవగతం అయ్యాము. అందుకే లోకులు నన్ను ముదిరిపోయిన బెండకాయ అన్నా, ముసలి కన్యా అన్నా పట్టించుకొని బాధపడటంలేదు. పైగా దాని తీరు అంతేలే అని జాలిపడ్తున్నాను.

దాచకుండా చెబితే నా వయసిప్పుడు ముప్పైఅయిదు. ఒకప్పటిలా నేనిప్పుడు అద్దం ముందు గంటల తరబడి కూర్చోవడంలేదు. అందుకు కారణం నశించిపోతున్న నా అందాల్ని అదేపనిగా చూసుకోవడం ఇష్టంలేకకాదు. వెధవ సౌందర్యం అడవిగాచిన వెన్నెలయ్యిందన్న అక్కసు. పద్దెనిమదేళ్ళ వయస్సులో పక్కింటి సుబ్బారావ్ పెళ్ళాడ్తానన్నపుడు 'కోతి వెధవా నీ కెంత ధైర్యం'రా అని తిట్టకుండా ఉండాల్సిందన్న పశ్చాత్తాపం. పైగా గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు అతనీ మధ్య మారుతీకారులో వెళ్తా ఫుట్ పాత్‌మీద నడిచివెళ్తున్న నన్ను పలకరించి జాలిగా చూడకపోతే నేనింతగా నా సౌందర్యంపట్ల విరక్తురాల్ని కాకపోయేదాన్నేమో.

అదేమిటో కర్మ నాకప్పట్లో ఒక మగాడు మగాడులా కనపడేవాడు కాదు. పాదాల దగ్గరి నుండి జుట్టుదాకా శల్య పరీక్ష చేసి వంకలు పెట్టేదాన్ని. అందులో ఉబుసుపోక చదివే నవలల ప్రభావం కూడా కొంత ఉంది లెండి. ఆరడుగుల ఎత్తు. అర ఎకరం ఛాతి. దానిండా నిగనిగ లాడే వెంట్రుకలు అంతే కాదు నన్ను అతగాడు ముద్దు పెట్టుకునేటప్పుడు గుచ్చుకొని గిలిగింతలు పెట్టేందుకు బుర్రమీసాలు. అవి గుచ్చుకుంటాయని నేను అలకలు పోవడాలు. అప్పట్లో నా బుర్రనిండా అలాంటి ఊహలే. ఊహలు ఊహలుగానే ఉండక రాత్రిపూట ఈస్ట్‌మన్ కలర్‌లో కనిపించి నన్ను మరింత గిలిగింతలు పెట్టేవి.

అలా నా వెర్రి ఊహల్లో నేను కొట్టుకుంటూ ఉండగానే. నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు అందుబాటులో ఉన్నవాళ్ళని పెళ్ళి చేసుకోవడం పిల్లల్ని కనేయడం అన్నీ జరిగిపోయాయి.



క్రమక్రమంగా నా కళ్ళకు పట్టిన పచ్చకామెర్ల జబ్బు నయమయ్యింది. పాపిట్లో మొలచిన తెల్ల వెంట్రుకల్ని చూపెట్టి ముదిరిపోయిన బెండకాయ అన్న బిరుదుకి శ్రీకారం చుట్టింది లోకం. జయప్రదల్లాంటి అందం అంతరించిపోయిం తర్వాత కూడా శరత్‌బాబులాంటి మొగుడే కావాలనుకోవడం అన్యాయం కదూ అని నిలదీసింది అంతరాత్మ. దాంతో ఒక్కొక్క కోర్కెనే వదిలేసుకుంటూ నాక్కాబోయే మొగుడు మగవాడైతే చాలు అన్న స్థితికి దిగజారాను నేను.

ఈలోగా నా పెళ్ళికోసం తాపత్రయపడే తల్లిదండ్రులు వెళ్ళిపోయారు. అత్తెసరు మార్కులతో పాసైన బిఎ డిగ్రీ గుమస్తాగిరికి తోడ్పడింది. ఇప్పుడు నన్ను పెళ్ళాడటానికి సిద్ధపడే వారిలో మొదటి పెళ్ళి వాళ్ళు తక్కువ. ఎవడైనా అలాంటి వాడున్నా వాడికి నా మీద కంటే నేను తెచ్చే జీతం మీద మక్కువ. నన్ను నేను పోషించుకోగలిగినపుడు మరొకడి అధికారం క్రింద బ్రతకడం నాకిష్టంలేదు. నేను పెళ్ళి కావాలనుకుంటున్నది ఈ యాంత్రిక జీవనంలో నుండి విముక్తికోసం. హాయిగా రిలాక్స్‌గా ఉత్తమ గృహిణిగా జీవించడంకోసం. ఓ స్త్రీగా స్త్రీత్వాన్ని సంపూర్ణంగా అనుభవించాలని కోరుకోవడంలో తప్పేమీలేదని మీరు అర్థం చేసుకుంటారనుకుంటాను.

రోజులు గడిచిపోతూనే ఉన్నాయి.

దాదాపు సంవత్సరం క్రితం అనుకుంటాను అరవింద పరిచయమయ్యింది. మా ఎదురింట్లో ఉంటుంది తను. నిజంగా ఆమె సార్థక నామధేయురాలు. "కలకానిది నిజమైనది బ్రతుకు కన్నీటి ధారలలో బలిచేయకు" అనేది ఆమె సిద్ధాంతం. నా వయసుదే అయిన ఆమెకూ ఇంకా పెళ్ళికాలేదు. అయితే మాత్రం ఆమెప్పుడూ నాలాగా ఉదాసీనంగా కనిపించదు. ఫ్రెండ్స్ విషయంలో ఆమె ఆడ మగ భేదాన్ని పాటించదు. బాయ్ ఫ్రెండ్స్‌తో తిరగడమేకాదు. వాళ్ళు ఇచ్చిన కానుకల్ని ధైర్యంగా నాకు చూపించి "పెళ్ళి ఎలాగూ చేసుకోలేవు వీలైతే అందుబాటులో ఉన్నవాడ్ని ఆదరించు" అని నాకు సలహాకూడా ఇస్తుంది. మొదట ఆమె ధోరణి నాకు నచ్చేది కాదు. నాలాంటి బుద్ధిమంతురాలికి అలాంటి సలహా ఇచ్చినందుకు కోపంకూడా వచ్చేది. కానీ క్రమంగా ఆమె మాటలు నా ఆలోచనా ధోరణిని కొత్త మలుపు తిప్పి నన్ను నేను తర్కించుకునేలా చేశాయి.

జీవితంలో వందలసార్లు జారబోయే నా కన్యాత్వాన్ని అతి ప్రయత్నంమీద రక్షించుకొని నేను సాధించిందేమిటి? చేజారిన అవకాశాన్ని తల్చుకొని తీరిగ్గా బాధపడటమా! నాకంటే చిన్న వాళ్ళు స్త్రీత్వాన్ని సంపూర్ణంగా అనుభవిస్తుంటే చూసి భరించలేక ఎవ్వరూ చూడకుండా కన్నీళ్ళు కార్చడమా! నిస్సారమైన ఈ జీవితం, క్షీణించిపోతున్న యవ్వనం, నన్ను క్షణక్షణం నిలదీసేవి.

దాని ఫలితమే నా ఈ ఆనందం. లోకం హర్షించదని తెలిసి కూడా ఓ సుముహూర్తాన నా కన్యాత్వాన్ని వదలకోవాలన్న నిర్ణయం చేసుకున్నాను. అంతేకాదు అందువల్ల ప్రాప్తించే మాతృత్వాన్నికూడా ధైర్యంగా స్వీకరించదలుచుకున్నాను. అందుకే నాకోసం ఎన్నో నెలలుగా ప్రయత్నిస్తున్న నా కొలీగ్ సుకుమార్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. నాకు తెలుసు అతనికి భార్యాబిడ్డలు ఉన్న సంగతి. అయితే అతనితో కాపురం పెట్టే ఉద్దేశ్యమే నాకు లేనప్పుడు అది ఆలోచించే విషయంకాదు. ఈ రోజు మధ్యాహ్నం అతను నన్ను లంచ్‌లో బైటకు తీసుకెళ్ళి హోటల్లో మంచి భోజనం పెట్టించి దారిలో బట్టల షాప్‌కి తీసుకెళ్ళి పదిహేనువందల రూపాయల మైసూర్‌సిల్క్ చీరకొని పెట్టాడు. ఆ సంతోషంతో సగం పూటకు ఆఫీసర్ దగ్గర పర్మిషన్ తీసుకొని ఇంటికి వచ్చేశాను నేను. ఇప్పటి నా సంతోషానికి అదండీ అసలు కారణం.

నేనున్న ఈ పరిస్థితిలో ఒక్క దగ్గరే కుదురుగా కూర్చోవడం నావల్ల కావటంలేదు. ప్లాస్టిక్ బ్యాగ్‌లోని చీరను బైటకు తీసి అందులో నా ముఖాన్ని దాచుకున్నాను. సుకుమార్ పేరులాగే చీర కూడా సుకుమారంగా ఉంది. అక్కడికీ నాకు తృప్తిగాలేదు. లేచి చీరను అరవోరగా చుట్టుకుని అద్దం ముందుకు వెళ్ళి నిలబడ్డాను.

పచ్చటి నా ఒంటికి వంగపూవు రంగు చీర అద్భుతంగా నప్పింది. రేపు రాత్రికి అందమైన ఈ చీరలో దాచిన నా అందాలన్నీ విప్పి తీసుకుంటాడు సుకుమార్. ఆ విషయం తలుచుకోగానే ఉద్వేగంతో నా హృదయం లయతప్పింది. మధురమైన ఊహలు ఒక్కసారిగా విజృంభించి నా వయస్సుని సగానికి తగ్గించాయి.

ఈ సంతోషాన్ని ఒక్కదాన్నే మోయలేకుండా ఉన్నాను. కనీసం అరవిందొచ్చినా బాగుండును. రోజూ తను కానుకల్ని చూపి జెలసీ ఫీలయ్యేది. నేను ఈ ఒక్క రోజైనా ఆమెను జెలసీకి గురి చేసేదాన్నే.

గంటలు గడచిపోతున్నాయి. రాత్రి పెరిగి పోతోంది. అయినా నా కంటిమీదకు కునుకు రావడంలేదు. దాదాపు అర్ధరాత్రి అవుతుండగా పక్కింట్లో నుండి ఏవో గుసగుసలు వినిపించాయి. ఒకప్పుడైతే భార్యాభర్తల మాటలు రాత్రిపూట చాటుగా వినకూడదనే నీతికి కట్టుబడేదాన్ని కాని, ఇప్పుడు నాకే తప్పు తప్పుగా కనిపించడంలేదు. ఆసక్తిగా గోడవైపు చెవి వొగ్గాను.

"ఛీ... నన్ను ముట్టుకోకండి" గట్టిగా కసురుతుంది పక్కింటి రమ.

"అనవసరంగా అలుగుతావెందుకు? అర్థం చేసుకోవేం? అయినా పట్టుచీర కొనిపెడితేనే ఇస్తాననడానికి ఇదేమైనా వ్యాపారమా?" అతని కంఠంలో లాలన.

"బుకాయించకండి... ఇన్నాళ్ళుగా ఆఫీస్‌లో డబ్బు రాగానే కొనిపెడతానని ఆశ చూపించి తీరా అవొచ్చినతర్వాత ఎవడో జేబు కొట్టాడని బుకాయిస్తారా. పైగా నన్నే తప్పుపడ్తున్నారా. నాకు తెలుసులెండి ఏ గర్ల్‌ఫ్రెండ్‌కో చీర కొనిపెట్టి ఉంటారు. నాలాగా ఉత్తపుణ్యానికి పక్కలోకి రావడానికి అది పెళ్ళాం కాదుకదా... ఈ రోజుల్లో వెడిపోవడం కంటే సుఖం మరోటిలేదు" రోషంగా అంటున్న ఆమె మాటలు చెళ్ళుమనిపించిన చెంపదెబ్బలో ఆగిపోయాయి.

"ఛీ... నీలాంటి రాక్షసి పెళ్ళాం అయితే ఏ మగాడు మాత్రం గర్ల్‌ఫ్రెండ్‌ని వెతుక్కోడు" ఈసడింపుగా అంది అతని కంఠం.

ఆ మాటలు విన్న తర్వాత నా మెదడుకి పట్టిన మత్తు ఒక్కసారిగా దిగిపోయింది.

కేవలం నా అంతే జీతం సంపాదిస్తున్న నా ప్రియుడి సంపాదన జామ్మని ప్రేయసికి పదిహేను వందల రూపాయల చీర కొనగలిగేంతది కాదు. కానుక పుచ్చుకుంటున్న సంతోషంలో నేనా విషయమే పట్టించుకోలేదు. పాపం ఆవిడ ఈ పాటికి ఈలాగే నిస్సహాయంగా ఏడుస్తూ... పరిచయమైనా లేని నన్ను తిట్టుకుంటూ ఉంటుంది.

చీర తిరిగి ఇస్తున్న నావైపు అయోమయంగా చూస్తూ "ఏమిటీ! ఎందుకు కోపమొచ్చింది" అని అడిగాడు సుకుమార్.

"బావుంది ఇది నాకోపానికర్థం అని ఎందుకనుకుంటున్నారు" హాయిగా నవ్వేస్తూ అన్నాను నేను.

"మరి" ఈసారి అతని కళ్ళల్లో మరింత విస్మయం.

"మీ దంపతుల మనశ్శాంతిని దోచుకోవడం నాకిష్టంలేదు. మీ మీది నా ప్రేమ చిరకాలం కొనసాగాలంటే ఇదే మంచిది. ఈ చీర కట్టుకున్న మీ భార్య కళ్ళు మీ వంక తృప్తిగా చూసినపుడు కానీ మీకు నేను చేసిన పని అర్థంకాదులెండి".

"థాంక్యూ" ఇలాంటి ప్రేయసులు కూడా ఉంటారా అన్నంత ఆశ్చర్యంగా ఉచ్చరించాయి ఆ పదాన్ని అతని పెదవులు.

నేను చేస్తున్నపని తప్పనినాకు తెలుసు. కానీ నేను సుఖపడాలంటే ఆ తప్పుచేయక తప్పదు. అలా అని నా కారణంగా మరొకర్ని బాధపెట్టడం నా అభిమతం కాదు. అందుకే ఈ నిర్ణయం. మనసనేది ఒకటున్న తర్వాత అరవిందలా హాయిగా సుఖపడటం ఎలా సాధ్యమౌతుంది చెప్పండి.